ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా







సభా ప్రాంగణం



బందరు పోర్టు విశేషాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్

నేడు బందరు పోర్టుకు శంకుస్థాపన

- పైలాన్‌ను ఆవిష్కరించనున్న సిఎం జగన్
- తొలిదశలో నాలుగు బెర్త్‌ల నిర్మాణం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: కృష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛ బందరు ఓడరేవుకు నిర్మాణ పనులు పండుగ వాతావారణంలో ప్రారంభం కానున్నాయి. మచిలీపట్నం ఉత్తర మండలం తపసిపూడి గ్రామ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌ఫీల్డ్ నాన్ మేజర్ పోర్టు పనులకు భూమి పూజ చేసి సోమవారం శంకుస్థాపన చేస్తారు. సిఎం పర్యటనకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి రాక సందర్భంగా హెలీకాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రెండు హెలీప్యాడ్‌లు నిర్మించారు. బందరు ఉత్తర మండలం తపిశపూడిలో పోర్టు బెర్త్‌ల నిర్మాణ ప్రాంతంలో సముద్రునికి హారతి ఇవ్వడానికి చెక్క వేదికను, పనుల ప్రారంభి సూచికగా ఆవిష్కరించడానికి పైలాన్ ఏర్పాటు చేశారు. బందరు జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలోని సౌట్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ వద్ద భారీ సభా ప్రాంగణాన్ని సిద్దం చేశారు.

ముఖ్యమంత్రి బందరు పర్యటన షెడ్యూల్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9 గంటలకు తపసిపూడి చేరకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన చెక్కవేదిక నుచి సముద్రానికి హారతి ఇవ్వనున్నారు. అనంతరం పోర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారు. పనులు ప్రారంభిస్తూ పైలాన్ ఆవిష్కరిస్తారు. అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.10 గంటలకు మచిలీపట్నం పోలీస్ గ్రౌండ్ హెలీప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. రోడ్డు మార్గంలో జెడ్పీ సెంటర్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు చేరకుంటారు. అక్కడ మచిలీపట్నం పోర్టుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శిస్తారు. ఉదయం 11 గటలకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సభ పూర్తయిన తర్వాత వెంటనే 11.40 గంటలకు పోలీస్ (మిగతా 6లో)

26న ఇళ్ల పట్టాల పంపిణీ

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ: రాజధాని అమరావతిలో ఈ నెల 26వ తేదిన పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టాల పంపిణీ చేయనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. రాజధాని ప్రాంతమైన అమరావతిలో ఆర్ 5 జోన్ నందు పేదలకు మంజూరైనా స్థలాలకు సంబంధించి పట్టాల పంపిణీ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదివారం రెవెన్యూ మున్సిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ప్రాంతం నడిబోడ్డున పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందుకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయడం జరిగిందన్నారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి లబ్దిదారులకు పట్టాల పంపిణీ చేయనున్నారన్నారు. విజయవాడ నగర పరిధిలో 24,600 మంది లబ్దిదారులకు గతంలో ఇళ్లస్థలాలు మంజూరు చేస్తామని హామి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. వీరిలో 20 వేల మంది లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లాల నుండి సుమారు 30 వేల మంది హాజరు అయ్యేయందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు 500 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. అవసరమైతే అదనపు బస్సులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సభకు హాజరయ్యేవారికి ఉదయం అల్పహారం, త్రాగునీరు, మజ్జిగ పాకెట్లను సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలను అందుకునే లబ్దిదారుల జాబితా తయారు చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. సంపత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, నగరపాలకసంస్థ డిప్యూటి కమీషనర్ సత్యవతి పాల్గొన్నారు.

వాంబేకాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు



వాంబేకాలనీలో రైల్వే ట్రాక్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

గన్నవరంలో కలకలం

సగం కాలిన స్థితిలో మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరంలో దారుణం జరిగింది. సగం కాలిన స్థితిలో ఉన్న రెండు మృతదేహాలు కలకలం రేపాయి. మండలంలోని సావరగూడెం సమీపంలోని బుడమేరు కాలువ వద్ద ఉన్న మామిడితోటలో సగం కాలిన స్థితిలో ఉన్న ఇద్దరి మతదేహాలను ఆదివారం స్థానిక రైతులు గుర్తించారు..వెంటనే పోలీసులు, అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మతదేహాలను పరిశీలించి అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నారు. రెండు మతదేహాల్లో ఒకరిది స్థానికంగా తిరుగాడే యాచకుడిదిగా గుర్తించినట్లు సీఐ కనకారావు తెలిపారు. మామిడితోట యజమాని ఇతర ప్రాంతంలో ఉండటంతో అక్కడికి వచ్చిన యాచకుడు.. సుమారు వారం రోజుల క్రితం మతి చెంది ఉంటారని వెల్లడించారు. ఎండ తీవ్రత కారణంగా మతదేహం కాలినట్లు మారిందన్నారు. మరో మతదేహం సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తిదిగా గుర్తించామన్నారు. చేతికి ఉన్న కడియం ఆధారంగా క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్నట్టు చెప్పారు.

సమగ్ర ఆస్తుల రికార్డుకు రీసర్వే

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వెంకటస్వామి

ప్రజాశక్తి-విజయవాడ

రీ సర్వే ప్రక్రియ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రాథమిక దశలో ఉందని, దీనిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే వి వెంకటస్వామి తెలిపారు. విజయవాడ నగరంలోని ప్రతి ఒక్క ఇంటినీ, స్థలాలు, రోడ్లు, మునిసిపల్, ప్రభుత్వ స్థలాలు, పబ్లిక్, ప్రయివేటు ఆస్తులు తదితర అన్నింటినీ సమగ్రంగా సర్వే చేయడం జరుగుతుందన్నారు. 1923లో నగరంలో మొదటి సారిగా సర్వే జరగగా, ఆ తరువాత 1964లో జరిగిందని, 60 ఏళ్ల తరువాత మరలా ఇప్పుడు సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా గృహాలకు, స్థలాలకు, వివిధ రకాల ఆస్తులకు కొత్త ఓనర్లు ఎవరనేది తేలుతుందని, తద్వారా వారి పేరుతో కొత్త రికార్డు తయారవుతుందన్నారు. నగరంలో రీ-సర్వే, దాని పూర్వపరాలు తదితర అంశాలపై వెంకటస్వామి 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎస్ఎన్‌బి-13 యాక్ట్ దేనిని సూచిస్తుంది?

జవాబు: సర్వే అండ్ బౌండ్రీస్ యాక్ట్-13 ప్రకారం సర్వే ప్రక్రియ పూర్తి అయినట్లు జిల్లా గజిట్‌లో పబ్లికేషన్ చేస్తారు.ప్రతి ఇంటికీ నోటీసు ఇచ్చి ఎక్నాలడ్జెమెంట్ తీసుకున్న తరువాత సర్వే కంప్లీట్ అయిందని 9 (2) నోటిఫికేషన్ ప్రకారం వెల్లడిస్తారు. ఒక వేళా



నిర్వహించిన సర్వేపై ఏవైనా అభ్యంతరాలున్నట్లు సంబంధిత యజమాని భావిస్తే జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అభ్యంతరాలను దరఖాస్తు రూపంలో పెట్టుకున్నట్లయితే వాటిని పరిశీలించి, పరిష్కరించడం జరుగుతుంది.

ప్రశ్న: విజయవాడ మునిసిపాలిటీగా తొలుత స్థాపన ఎప్పుడు జరిగింది?

జవాబు: 1888 ఏప్రిల్‌లో మునిసిపాలిటీగా విజయవాడ ఏర్పడింది.

ప్రశ్న: టౌన్ సర్వే విజయవాడలో ఎప్పుడు జరిగింది?

జవాబు: డిటైల్డ్ టౌన్ సర్వే తొలిసారిగా 1923లో జరిగింది. అప్పుడు 12 రెవెన్యూ వార్డులు, 137 బ్లాక్‌లు, 6,231 ఇళ్లు, 3,432. 42 ఎకరాల వైశాల్యం పరిధిలో ఉన్నట్లు సర్వేద్వారా గుర్తించారు.

ప్రశ్న: సెలక్షన్ గ్రేడ్ ఎప్పుడేర్పడింది?

జవాబు: ఆ తరువాత 1960లో సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీ అయింది. దీనిలో జాగీర్ మాచవరం, విద్యాధరపురంవిలేజ్, విజయవాడ విలేజ్, ముత్యాలంపాడు విలేజ్,



మొఘల్రాజ్‌పురం విలేజ్, పటమట పార్ట్ విలేజ్ ఇవ్వన్నీ కలిపి ఈ మునిసిపాలిటీలో ఆనాడు ఉండేవి. 4,708.55 ఎకరాలు వైశాల్యం మేర ఈ మునిసిపాలిటీలో అప్పుడు మెర్జ్ అయ్యాయి. మరలా 1964లో రీ-సర్వే జరిగింది. 17 రెవెన్యూ వార్డులుగా, 275 బ్లాక్‌లు, 21,374 ఫీల్డ్స్, 8,140.97 ఎకరాల మునిసిపాలిటీ పరిధిలో ఉండేది.

ప్రశ్న: కార్పొరేషన్‌గా ఎప్పుడు ఏర్పడింది?

జవాబు: సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీల నుంచి 1981లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడింది. ఆ తరువాత 1985లో గుణదల, పటమట, భవానీపురం, పాయకాపురం, కుందావారి కండ్రిక కార్పొరేషన్‌లో విలీనం అయ్యాయి. 7,149.91 ఎకరాల విస్తీర్ణం పరిధిలో ఆనాడు ఉండగా, అది క్రమంగా 15,290.88 ఎకరాల విస్తీర్ణంలో నేడు కార్పొరేషన్ ఉంది. (మిగతా 6లో)

దుర్గగుడిలో ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్

ప్రజాశక్తి-భవానీపురం: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో అన్నదానం, క్యూ లైన్లలో యాత్రికుల సౌకర్యాల గురించి ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆదివారం స్వయంగా పరిశీలన చేశారు. దేవాలయం మహామండపం 2వ అంతస్తు నందు, ఆలయము నందు ప్రతిరోజూ జరుగు అన్నదానం కార్యక్రమం మరియు క్యూలైన్‌లను ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదం స్వీకరిస్తున్న పలువురు భక్తులను మరియు క్యూ లైన్‌లలోని భక్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అన్నదానం మరియు ఇతర ఏర్పాట్లపై యాత్రికులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.. అన్నదానం సిబ్బందితో మాట్లాడి అన్నదాన కార్యక్రమం గురించి వివరాలు తెలుసుకుని, అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుర్గమ్మను ఆదివారం రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి



రాంబాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తయ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.



మహిళల చదరంగం విజేత లాస్య

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఫిడే మహిళల చదరంగం పోటీల విజేతగా జి.లాస్య నిలిచింది. నగరంలోని గేట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ నందు గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న చదరంగం ఫైనల్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈపోటీలకు 26 జిల్లాల నుండి 90 మందికిపైగా మహిళా క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి అక్కినేని హాస్పటల్స్ సీఈవో అక్కినేని మణి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ముఖ్యంగా క్రీడల్లో సత్తా చాటుతున్నారని అన్నారు. విజయవాడ నగరం క్రీడలకు ఎంతో ప్రసిద్ధి చెందిందని ఇక్కడ నుండి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళల చెస్ పోటీలు విజయవంతంగా నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ మందుల రాజీవ్ మాట్లాడుతూ ఈపోటీలు మొత్తం ఎనిమిది రౌండ్లుగా జరగగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఉమెన్ ఫిడే మాస్టర్ లాస్య 8 రౌండ్లకుగాను 8 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే కృష్ణాజిల్లాకు చెందిన ఉమెన్ ఫిడే మాస్టర్ పి.సుప్రీత 6.5 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లాకు చెందిన ఉమెన్ ఫిడే మాస్టర్ కె.సాయి నిరుపమ 6.5 పాయింట్లు సాధించి తృతీయ స్థానం, అనకాపల్లికి చెందిన బి.శ్రావ్య 6 పాయింట్లు సాధించి నాల్గవ స్థానం సాధించారు. ఈనలుగురు జూన్ 30వ తేదీ నుండి జులై 10వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలో జరుగనున్న సీనియర్ ఉమెన్స్ మహిళల నేషనల్స్ పోటీలకు మన రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంధ్ర అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పత్తిపాటి మస్తానయ్య, రోటరీ మిడ్ టౌన్ విజయవాడ అధ్యక్ష, కార్యదర్శిలు మాగంటి కృష్ణ ప్రభు, ఎన్‌టిఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ లంకపల్లి మనోజ్, టోర్నమెంట్ చైర్మన్ ఇంటి ప్రదీప్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం అండ : శ్రీకాంత్

ప్రజాశక్తి-వన్‌టౌన్: విశ్వబ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి



శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్ అలయన్స్ సర్వీసెస్ హైదరాబాద్ అధ్యక్షులు గోల్తి మల్లికార్జునరావు అధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక, ఉచిత వైద్య శిబిరం జరిగింది. తొలుత శ్రీ విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో అనేక మంది లబ్ధి పొందారని వివరించారు. సంస్థకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం నిర్వాహకులు చైర్మన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, సంఘ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణ, వి. మంగేష్, పూడి బంగారయ్య, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీషుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మైలవరం: వేసవి విజ్ఞాన శిబరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థిని,విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు టి సురేష్ బాబు తెలుగు బోధన పద్ధతులు, ఇంగ్లీష్ గ్రామర్ గురించి అవగాహన కల్పించారు. ముందుగా కథల పుస్తకాలు చదివించి, చెప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు చదవడం ద్వారా లోకజ్ఞానం పెరుగుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, రాంబాబు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతి విచ్ఛిన్నానికి జగన్ కుట్ర : టిడిపి



ప్రజాశక్తి-వన్‌టౌన్: రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేసేందుకు సీఎం జగన్ కుట్ర చేస్తున్నారని, జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అధోగతి పాలైందని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి సాదరబోయిన ఏడుకొండలు ఘాటుగా విమర్శించారు. తెలుగుదేశం పశ్చిమ కార్యాలయం (బుద్ధ వెంకన్న కార్యాలయం) లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధానిని ఏ విధంగానన్నా విచ్ఛిన్నం చేయాలని దుష్ట ఆలోచనతోనే సీఎం జగన్ సెంటు భూమి స్థలాల పేరుతో హడావుడి చేస్తున్నారన్నారు. అమరావతి రాజధానిలో 51వేల మంది పేదలకు సెంటు భూమి చొప్పున ఇస్తున్న సీఎం జగన్‌కు పేద ప్రజల మీద ఏమాత్రం ప్రేమ ఉన్నా కనీసం సెంటున్నరన్న అయినా ఇవ్వాలని ఎందుకు లేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు ఇచ్చే పట్టాలపై ప్రజలకు పూర్తి హక్కులు ఉండవని తెలిసి కూడా జగన్ హడావుడి చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో కొన్ని లక్షల టిడ్కో 90 శాతం మీద పూర్తయినా, వాటిని పూర్తి చేసి ప్రజలకు ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నాయకులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వారిని తరిమి కొడుతున్నారని అన్నారు. ఎంపీ నందిగం సురేష్ ,మంత్రి ఆదిమూలపు సురేష్ తెలుగుదేశం నాయకులు చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలితే ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు . రానున్న ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు బూదాల నంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు పితృవియోగం

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని మేడూరు గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కోట



వెంకటేశ్వరరావు తండ్రి కోట నరసింహారావు (76) గంపలగూడెంలో శనివారం రాత్రి మరణించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నరసింహారావు మతదేహాన్ని పలువురు పుర ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు జరిగాయి.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: వెల్వడం లక్కిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1987 -1992 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో వెల్వడం గ్రామంలోని మెయిన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ాడూరు శ్రీలక్ష్మి వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు



పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచినీళ్ల మజ్జిగను అందజేస్తున్నామన్నారు.

వైసిపిది అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గత నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో వాతావరణం భయంకరంగా తయారైందని ఎక్కడ చూసినా దోపిడీ అరాచకాలు తప్ప అభివద్ధి జాడలేదని విజయవాడ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ లు తెలిపారు. శనివారం జగ్గయ్యపేట చిల్లకల్లు రోడ్డులో గల శుభమస్తు గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ శ్రీరాం రాజగోపాల్ అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ లు పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో వచ్చినట్లే మళ్లీ ప్రభంజనం రాబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల్లో అప్పుడే మార్పు మొదలైందని, టిడిపి నాయకులు ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారాని, జగన్ రెడ్డి పాలన మూడున్నర ఏళ్లు అవుతున్నప్పటికీ అన్ని రంగాలను జగన్ రెడ్డి నాశనం చేశారని, ఏ ఒక్కరికి పని లేకుండా పోయిందని, ఉద్యోగాలు ఇస్తానన్న జగన్ రెడ్డి యువతకు ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించలేదని, అమ్మ ఒడి పథకాన్ని అర్థ వోడి చేశారని, ఈ పరిస్థితులన్నీ మారాలన్నా, రామరాజ్యం రావాలన్నా మళ్లీ నారా చంద్రబాబు



నాయుడు ముఖ్యమంత్రి అవ్వాలని పెద్దలు స్పష్టం చేశారు. రాబోవు ఎన్నికలు రాక్షసులకి రామునికి జరిగే యుద్ధంలా ఉంటాయని, జగ్గయ్యపేట నియోజకవర్గం శ్రీరామ్ రాజగోపాల్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ దొంతు చిన్న, ముల్లంగి రామకష్ణారెడ్డి, శ్రీరామ్ సుబ్బారావు, మేక వెంకటేశ్వర్లు, ఆచంట సునీత, కట్ట వెంకట నరసింహారావు, వడ్లమూడి రాంబాబు, చింతల సీతారామయ్య, కన్నెబోయిన రామలక్ష్మి, మైనేని రాధాకష్ణ, జిల్లేపల్లి సుధీర్ బాబు, కారుపాటి డేవిడ్, సయ్యద్ అన్వర్, మన్నే కళావతి, తోట నాగమల్లేశ్వరరావు షేక్ కరీముల్లా, నూకల కుమార్ రాజా, పొట్టపొంగు బాబురావు, తాటి రామారావు, మూడు రాంబాబు, గట్టిడి దుర్గాప్రసాద్, కానూరు కిషోర్, గద్దె రాజ్యలక్ష్మి, షేక్ మదార్, షేక్ సుభాని, వేదులాపురి సైదేశ్వర రావు, చిలుకూరు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, సూర్యదేవర ఉషారాణి, గెల్ల సంధ్యా, రాణిగొట్టి నాగరాజు, సంగెపు బుజ్జి, ఇర్రి నరసింహారావు, కంచేటి గీతారాణి, సామినేని మనోహర్, నకిరికంటి వెంకటి పాల్గొన్నారు.



చలివేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని చలివేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచలని శానిటరీ కార్యదర్శులకు మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ కు మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు సూచించారు. పట్టణంలోని చలివేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. చలివేంద్రాలకు త్రాగునీరు అవసరమైన యెడల పురపాలక సంఘము నుండి సరఫరా చేయడం జరుగుతుందని, అందుకుగాను మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ లేదా మున్సిపల్ కమిషనర్ కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సేవా సంస్థల వారు క్యానుల ద్వారా చల్లటి అర్ ఓ ప్యూరిఫైడ్ నీరు అందచేస్తున్నందున వారికి అభినందనలు తెలిపారు. వేసవి కాలం వేడి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజల శ్రేయస్సు దష్ట్యా సేవా సంస్థల వారు రాత్రి ఎనిమిది గంటల వరకు అందించాలన్నారు. పురపాలక సంఘంలో తాగునీరు సమస్య నిమిత్తం కాల్ సెంటర్ ఏర్పాటు చేయటం జరిగిందని, కె.వేంకటేశ్వరరావు 9949932038, అసిస్టెంట్ ఇంజినీర్ 9849906575, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 9849907979, మున్సిపల్ కమిషనర్ : 9849905823లను సంప్రదించాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గోపినేనిపాలెం గ్రామానికి చెందిన అలసకాని గురవయ్య, లక్ష్మీనరసమ్మ కుటుంబసభ్యులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ కార్యనిర్వహణాధికారి వరప్రసాద్ స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-మైలవరం: మైలవరంలోని పూర గుట్ట సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ దాడిలో రెండు కోళ్లు, 1130 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్

ప్రజాశక్తి-నందిగామ: కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు, నందిగామ పట్టణ పరిధిలో "మేరా లైఫ్ -మేరా స్వచ్ఛ షహర్ ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రియూజ్, రిసైకిల్) కార్యక్రమము సోమవారం సాయంత్రం ఐదు గంటలకు గాంధీ సెంటర్‌లో నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు, చైర్‌పర్సన్ వరలక్ష్మి పాల్గొంటారని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణాజిల్లా ప్రజల చిరకాలవాంఛ మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపనకు ఈరోజు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మచిలీ పట్నం పర్యటనకు వస్తున్న సందర్భంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు. పేర్ని వెంకట్రామయ్య (నాని) పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, శాసన మండల సభ్యులు తలశిల రఘురాం, మాజీ మంత్రి కొడాలి నాని, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, వివిధ శాఖల తదితరులతో కలిసి సిఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. తొలుత స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్ పక్కన గల జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిర మైదానం వద్ద ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ ప్రాంగణాన్ని ఈ బృందం పరిశీలించింది. బహిరంగ సభ వేదిక ఎదురుగా ఏర్పాటు చేసిన డి సర్కిల్ లో మామిడి తోరణాలు అరటి పిలకలతో సాంప్రదాయంగా అలంకరించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేకంగా సభాస్థలి పక్కనగల చిన్న వేదిక వేదిక ఏర్పాటు, విఐపి, మీడియా గ్యాలరీ, ఫోటో గ్యాలరీ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్ల తీరును ఈ బృందం పర్యవేక్షించింది. అనంతరం తపసిపూడిలోని ముఖ్యమంత్రి తాడేపల్లి నుంచి నేరుగా దిగి హెలిప్యాడ్, తర్వాత పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే స్థలం, ముఖ్యమంత్రి సముద్ర హారతి ఇచ్చే వేళ సముద్ర తీరంలో 50 పడవలను ఎదురుగా అర్ధ చంద్రాకారంలో లంగరు వేసి నిలబెట్టేందుకు చేసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే పేర్ని నాని అధికారులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్, జిల్లా ఎస్పీ పి. జాషువా, మచిలీపట్నం పోర్ట్ ఎండి విద్యాశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ సలార్ దాదా, మచిలీపట్నం మాజీ జెడ్పీటిసి లంకె వెంకటేశ్వరరావు(ఎల్వీయార్) అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, ఆర్డీవో ఐ. కిషోర్, తహసిల్దార్ సునీల్ బాబు, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, యువజన నాయకుడు పేర్ని కష్ణమూర్తి (కిట్టు), పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జులు, పలువురు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠమైన బందోబస్తు :ఎస్పి

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి బందరు పోర్టు పనులు ప్రారంభోత్సవానికి రానున్న నేపథ్యంలో కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు వరకు బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పి జాషువా ఆదేశించారు. స్థానిక హిందూ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం బందోబస్తు సమర్థవంతంగా నిర్వర్తించేందుకు జిల్లా ఎస్పీ జాషువా పోలీసు అధికారులు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల పట్ల పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అందులో ఇద్దరు అడిషనల్ ఎస్పి స్థాయి అధికారులు, 9 మంది డీఎస్పీ స్థాయి అధికారులు, 37 మంది ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు, 92 మంది సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు ఇతర సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తారన్నారు. ముఖ్యమంత్రిని చూడడానికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహ రించాలన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన పొట్టిదిబ్బ గ్రామంలోని రెండు కుటుంబాలకు జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని దేవరపల్లి శివారు పొట్టదిబ్బలంక గ్రామంలో గ్యాస్ సిలిండర్ లీక్ అయి అగ్ని ప్రమాదం సంభవించడంతో గొరిపర్తి సుబ్బయ్య, గొరిపర్తి కష్ణ కు చెందిన రెండు ఇల్లు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు సర్వం కోల్పోయి గూడు లేని స్థితిలో నిలబడ్డారు. ఆదివారం సర్పంచి మరీదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భీమవరపు శ్రీలక్ష్మి, వార్డ్ నెంబర్ పొనమాల వెంకటేశ్వరరావు,వీఆర్వో శ్రీనివాసరావుతో కలిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3500, వంటనూనె బియ్యం నిత్యవసర సరుకులను అందించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థికపరమైన సహాయ సహకారాలు సకాలంలో అందేలా చూస్తామని రామ్మోహన్ రెడ్డి బాధితులకు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యార్థులకు మేలైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని పూషడం ఎంపీపీ స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్, లంకపల్లి పీపీసీఎస్ చైర్పర్సన్ గల్లా గిరీష్ విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. పూషడం గ్రామంలోని ఎంపీపీ స్కూల్ లో అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరీష్ మాట్లాడుతూ విద్యార్థులకు మేలైన విద్యనందించటంతోపాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలల వైపు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకష్ణ, ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల చేరువలో వలంటీర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న గ్రామ వాలంటీర్ల మీదే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని వాలంటీర్లు చేస్తున్న సేవలకు గుర్తింపుగా సేవారత్న సేవా మిత్ర సేవా వజ్ర అవార్డుల కార్యక్రమం వైసిపి కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల కోసం చేపట్టే ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వాలంటీర్ల కషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 251 మంది వాలంటీర్లలో మంచి ప్రతిభ ఘనపరిచిన ఐదు మందికి సేవారత్న అవార్డులు రాగా ఒక్కొక్కరికి 20వేల నగదు పారితోషకంతో పాటు మేమెంటో మెడల్ సర్టిఫికెట్తో సత్కరించారు. అదేవిధంగా 230 మందికి సేవా మిత్రా



అవార్డులను అందజేయడంతో పాటు మెడల్ రూ పదివేల నగదు సర్టిఫికెట్ అందజేసి శాలువాలతో సత్కరించారు. ఇన్చార్జి ఎంపిడివో పి శైలజ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా , రామకోటి పురం, దక్షిణ చిరువాలంక సర్పంచులు ముడిమి తిరుపతమ్మ, సనక సుబ్రహ్మణ్యం, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు

రోగిపై డాక్టర్ దౌర్జన్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శనివారం వికలాంగుడైన ఓ పేషంట్ పై కాంట్రాక్ట్ డాక్టర్ సూర్యతేజ దర్జన్యం చేసిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జే ప్రభుదాస్ షుగర్ పేషంటు కాగా మందులు తెచ్చుకునేందుకు



వైద్యశాలకు వెళ్ళినట్లు తెలిపారు. డాక్టర్ను తనకు కావలసిన మందుల వివరాలు డాక్టర్కు చెబుతుండగా తనకు మందులు వివరాలు నువ్వు చెప్పేది ఏంటి అంటూ ఆగ్రహంతో కేకలు వేశారని.. కాదు సార్ ఈ వైద్యశాలకు వచ్చి తరచూ అవే మందులు తీసుకు వెళుతుంటానని చెప్పడంతో మరింత ఆవేశానికి గురై తనపై చేయి చేసుకోవడంతో పాటు వికలాంగుడైన తనను కిందకు పడదోసారని తోటి పేషెంట్లు వచ్చి తనను పైకి లేపారన్నారు. అంతేకాకుండా నువ్వు ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకోపోమంటూ మాట్లాడారని ఆరోపించారు. ఈ మేరకు అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు వైద్యశాల సోపాడేందుకు కూడా ఫిర్యాదు చేసినట్లు ప్రభుదాస్ చెప్పారు వికలాంగుడైన తనపై దౌర్జన్యం చేసి దాడి చేసిన డాక్టర్ పై చర్య తీసుకోవాల్సిందిగా ప్రభుదాస్ కోరుతున్నారు

రోగులకు రొట్టెలు, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : సింహాద్రి శ్రీమన్నారాయణ(శివ) 24వ వర్ధంతిని పురస్కరించుకొని శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైసిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు అవనిగడ్డ ఏరియా వైద్యశాలలోని రోగులకు రొట్టెలు మజ్జిగ అందజేశారు. ఆదివారం వైద్యశాలలోని డాక్టర్ చేతుల మీదుగా రోగులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా, మాజీ సర్పంచ్ నలకుర్తి పధ్వి రాజు పాల్గొన్నారు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 33 వ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి, పిసిసి సెక్రెటరీ మహమ్మద్ దాదాసాహెబ్, పెడన అసెంబ్లీ ఇన్చార్జి, పీసీసీ డెలిగేట్ లింగాల సుధాకర్ రావు, నగర అధ్యక్షులు కొడమంచిలి చంద్రశేఖర్, డిసిసి మీడియా చైర్మన్ ఊటుకూరి శాంతిరాజు, డిసిసి సేవాదళ్ అధ్యక్షుడు చిలుకోటి ప్రసాద్, డిసిసి మైనార్టీ ముస్లిం సెల్ అధ్యక్షులు షేక్ చాన్ బాషా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పెనమలూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖలీల్, మీర్జాబేగ్, మహ్మద్ రఫీ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు తొలతగా ఆయన చిత్రపటానికి మీర్ రిజ్వాన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు. కాంగ్రెస్ నేతలు యన్నం గంగాధరరావు, కొండేటి భాస్కరరావు, షేక్ మహబూబ్ సుభానీ, చల్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1997-2000 సంవత్సరంలో బీకాం విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా ఉల్లాసభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి ఎకనామిక్స్ లెక్చరర్ పి ఆర్ కె ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అందరూ కలిసి తమ జీవిత విశేషాలను పంచుకుంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకులు ముమ్మారెడ్డి రామారావు, ఏ కోటేశ్వరరావు, వై అజయ్,ు డిగ్రీ కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఏ వీర కుమారి, బంటుమిల్లి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ జగన్ మోహన్‌రావు, రిటైర్డ్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ బి సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న దుడ్డు కష్ణారావు పలువురు ఆనాటి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా డిగ్రీ కళాశాలకు రూ పదివేల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాలలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు

ఆక్రమణకు గురవుతున్న రహదారులు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి గ్రామపంచాయతీ పరిధి నారాయణరావు నగర్ లోని రహదారులు నిత్యం ఆక్రమణలకు గురి కావడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు డ్రైనేజీలతోపాటు రోడ్లను కబ్జా చేసి పక్క భవనాలు నిర్మించడంతో రహదారులు కుచించుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఏ రోడ్డు చూసినా ఆక్రమణ కనపడుతున్నాయి. ముఖ్యంగా చల్లపల్లి-విజయవాడ ప్రధాన రహదారి నుండి గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరి గుంటల మయంగా మారడం, అదే రహదారి వెంట డ్రైనేజీ ఆక్రమించి మెస్ వేసి మెస్సును ఆనుకొని రాళ్లు, రప్పలు గుట్టలుగా వేయటంతో రహదారి సగం వరకు కుంచించిపోయి ప్రమాదాల నిలయంగా మారాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి వెంట ప్రయాణం నరకానికి మార్గం అని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . ఇటీవల గడపగడప కార్యక్రమంలో రహదారి ఆక్రమణల పై శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుకు స్థానికులు వివరించగా రహదారిపై ఆక్రమణలను వెంటనే తొలగించమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తొలగిస్తామని చెప్పిన సంబంధిత అధికారులు నేటికీ స్పందించకపోవడంపై కాలనీ వాసులు అధికారులపై మండిపడుతున్నారు. కాలనీలో రహదారులు ఆక్రమణ గురి కావటం, రహదారులు గుంటలు



మయం కావడంతో ఎప్పుడు ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందో అనీ కాలనీ వాసులు భయపడుతున్నారు. ఈ రహదారిపై కళాశాలకు వెళ్లే విద్యార్థులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పనులకు వెళ్లే కార్మికులు, వాహనదారులు ప్రయాణం నిత్య నరకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై ఆక్రమణలను తొలగించమని శాసనసభ్యులు ఆదేశించి నెలలు గడుస్తున్న నేటికీ తొలగించకపోవడంపై కాలనీవాసులు అధికారులపై మండిపడుతున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- మైలవరం : కారు ఢీకొని ఒకరు మతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు ప్రకారం జి.కొండూరు మండలం కుంటముక్కలకు చెందిన మైలవరపు నరసింహారావు (29)ఏ.కొండూరు మండలం చీమలపాడు కు చెందిన కన్నబాబులు వంట పనులు చేస్తూ ఉంటారు. ఇరువురు మైలవరంలో వంట పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై కుంటముక్కల వెళ్తుండగా విజయవాడ నుండి కంభంపాడు వెళుతున్న కారు ముందు వెళుతున్న ఓవర్ టెక్ చేయబోయి డిగ్రీ కళాశాల సమీపంలో బైక్ ను ఢీకొంది. ఈ ఘటనలో నరసింహారావు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.కన్నబాబు కు గాయాలవ్వగా, మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సంఘటన స్థలానికి మైలవరం ఎస్సై హరిప్రసాద్ చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కెసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్మయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామ సిపిఐ కార్యదర్శి చాట్ల. లక్ష్మయ్య (56) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మతి పట్ల గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, సీనియర్ నేత వేల్పుల రవికుమార్, జెడ్పీటీసీ నాగమణి, మండల సీఐటీయూ కార్యదర్శి దారా నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు బాబు, ప్రభాకర్, సీపీఐ నాయకులు బ్రహ్మం, మండల దేశం పార్టీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య పలువురు నేతలు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఐరన్ మాత్రలు రోజూ వేసుకోవాలి



ప్రజాశక్తి- తిరువూరు : రక్త హీనతను అధిగమించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఐరన్ మాత్ర లు ప్రతి రోజూ పిల్లలు వేసుకునేలా చూడాలని ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాం ప్రదీప్ తల్లిదం డ్రులకు విజ్ఞప్తి చేశారు. తిరువూరు మండలంలోని టేకులపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆయన మా ట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠ్యపు స్తకాలతో పాటు, దిన పత్రికలు, కథల పుస్తకాలు చదవాలని విద్యార్థులకు సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఈసందర్భంగా తల్లిదం డ్రులను కోరారు.

306 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-హెల్త్ యూనవర్సిటీ: ఆరోగ్య సమస్యలకు మూల కారణం ఒత్తిడి అని దానిని అధిగమించి చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని ఎం. జె. నాయుడు హాస్పిటల్ సలహాదారు వావిలాల రజినీ కాంత్ శర్మ అన్నారు. అజిత్ సింగ్ నగర్ లోని వివేకా నంద స్కూల్ నందు ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది అని తెలిపారు.306 మందికి వైద్య సేవలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : దుర అలవాట్లకు యువత దూరంగా ఉండాలని అవనిగడ్డ నియోజకవర్గ యువనేత సింహాద్రి వికాస్ అన్నారు. మోపిదేవి మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో క్రికెట్ టోర్లమెంట్‌ను ఆదివారం వికాస్ ప్రారంభించారు. గ్రామానికి చెందిన యన్నం హరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించిన వికాస్ క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతో పాటు కొద్దిసేపు క్రికెట్ ఆడి, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్ పర్సన్ ఆది రాంబాబు, ఆర్ వెంకటరమణ, అవనిగడ్డ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గాజుల జయ గోపాల్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కామిశెట్టి వెంకట సురేష్ బాబు, దివి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగం జగదీష్ కుమార్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కైలా కన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నందిగామలో తాగునీటికి కటకట



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో మంచినీటి ఎద్దడి రోజు రోజుకి ఎక్కువవుతుంది .ఇక్కడ మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మునేటి వేసిన బోరులు పూర్తిగా కాలిపోవడంతో ప్రజలకు తాగునీరు అందని ద్రాక్షగా మారింది. కాత్రేనిపాడు మంచినీటి ఎత్తిపోతల పథకం మోటర్లు పూర్తిగా కాలిపోవడంతో మంచినీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నందిగామ డివిఆర్ కాలనీ ఉమా కాలనీ, మొక్కపాటి కాలనీ, 11వ వార్డు, 16వ వార్డు, 14 వార్డు నెహ్రూ నగర్ తదితరు ఏరియాలో మంచినీరు లేక ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. అరకొరగా మంచినీరు వస్తున్న ఏరియాలో అక్రమ మోటార్ కనెక్షన్లు పెట్టుకొని కొంతమంది బడా వ్యక్తులు మంచినీరు శౌర్యం చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది మాముళ్ళకు అలవాటు పడి పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డివిఆర్ కాలనీలో గత వారం రోజుల నుండి మంచినీరు రాక పలు అవస్థలు పడుతున్నారు. కనీసం ఇంటి అవసరాలకు కూడా నీరు లేక డివిఆర్ కాలనీ ప్రజలు వాళ్ళు ఇబ్బందులు గురవుతున్నారు. వేసవికాలం ఎండ తీవ్రంగా ఉండ డంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు పనిచేయడం లేక ప్రజలు మంచినీరు కోసం ఇబ్బందులు పడుతున్నారు . మంచినీటి వాటర్ ట్యాంక్ మొక్కు బడిగా వస్తుండడంతో ప్రజలకు త్రాగునీరు కూడా అందడం లేదని డివిఆర్ కాలనీ సిపిఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. మంచినీటి వాటర్ ట్యాంకు వస్తున్న నీరు కేవలం పనికి పలుకుబడి కలిగిన వారికి మాత్రమే ట్యాంకర్ ద్వారా నీరుస్తున్నారని సామాన్యులకు నీళ్ల అందటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందిగామ పట్టణంలో శాశ్వత మంచినీటి పథకం కింద సుమారు 90 కోట్లు వ్యయంతో ఏసియన్ గ్రాండ్స్ నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నామని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో నిర్మాణం జరగడం లేదు. శాశ్వత మంచినీటి పథకం నిర్మాణం కోసం నందిగామ పట్టణంలో రెండుసార్లు శంకుస్థాపన చేశారు. ఆ శంకుస్థాపన చేసిన శిలా పలకాలు నందిగామ గాంధీ సెంటర్లో ఉత్సవ విగ్రహాలు లాగా దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి, ప్రస్తుత విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నందిగామ పట్టణంలో శాశ్వత మంచినీటి పథకం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి ఏడాది కాలం దాటినప్పటికీ ఇంతవరకు ఆ పథకం నిర్మాణ పనులు మొదలు కాలేదు. ప్రజలకు అత్యవసరమైన మంచినీరు సౌకర్యం కల్పించడంలో నందిగామ మున్సిపల్ అధికారులు పాలకవర్గం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు నిత్యవసరంగా ఇచ్చే మంచినీరు రక్షిత మంచినీటి పథకాలు వినియోగం కూడా అంతంత మాత్రమే ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.



డివిఆర్ కాలనీ మంచినీరు లేక ప్రజల అవస్థలు
వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు, డివిఆర్ కాలనీ



నందిగామ డివిఆర్ కాలనీలో వారం రోజుల నుండి మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కనీసం అవసరాలకు కూడా నీళ్ల లేవు బోర్లు పనిచేయడం లేదు మున్సిపల్ ట్యాంకర్ అప్పుడప్పుడు వచ్చి అధికార పార్టీ వారికి మాత్రమే మంచినీళ్ల ఇస్తున్నారు సామాన్య ప్రజలకి నీళ్ల ఇవ్వకుండా వెళ్ళిపోతున్నారు మంచినీరు వచ్చేవరకు ఆందోళన చేపడుతాం .

మంచినీళ్లు ఇవ్వకపోతే ఆందోళన చేపడతాం
ఉప్పుతోళ్ల కుమారి, సిపిఎం నాయకురాలు, డివిఆర్ కాలనీ



డివిఆర్ కాలనీలో మంచినీళ్ల ఇవ్వకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు తాగడానికి నీళ్ల లేవు ఇంట్లో ఏ అవసరానికి కూడా నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నాము అధికా రులు చెప్పిన పట్టించుకోవడం లేదు నీళ్ల వచ్చే వరకు ఆందోళన చేపడుతాం

మినరల్ వాటర్ కొనుకుంటున్నాం
లాస్య, డివిఆర్ కాలనీ



డివిఆర్ కాలనీలో మంచినీళ్ల లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుక్కొని తాగుతున్నామని మా కాలనీలో అందరూ పేదవారు ఉండడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేయలేక దాహత్తో అలమటిస్తున్నారు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి డివిఆర్ కాలనీకి మంచినీరు అందించాలని కోరారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు



ప్రజాశక్తి-మైలవరం : మైలవరంలో జగనన్న కాలనీల నిర్మాణం కొరకు అందజేసిన సిమెంట్ బస్తాలు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో గడ్డకట్టి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. దీనితో గహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మైలవరంలోని పూర గుట్టలో సుమారు 2430 మంది లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీరిలో కొంతమంది ఇల్లు నిర్మించుకోగా,మరికొందరు స్తోమత లేక ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రైవేట్ కాంట్రాక్టర్ లబ్ధిదారులకు ఇల్లు కట్టించి ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. 500 ఇళ్ల నిర్మాణల కోసం అధికారులు గుత్తేదారుకు ప్రభుత్వం అందజేసిన ఐరన్,500 సిమెంట్ బస్తాలు అందజేశారు. 15 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. సిమెంట్ బస్తాలకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో అకాల వర్షాలకు బస్తాలన్నీ తడిచి,గడ్డకట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణి ఇందు కారణమని లబ్ధిదారులు వాపోతున్నారు. సిమెంట్ బస్తాలు గడ్డకట్టయాని, హౌసింగ్ అధికారులు దష్టికి తీసుకువెళ్లగా కొంతమంది ఇంటి నిర్మాణాలకు ముందుకు రాకపోవడంతో ఇలా జరిగిందని, రెండు నెలల నుంచి కాంట్రాక్టర్ కూడా అందుబాటులో లేరని చెప్పడం గమనార్హం.



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్స్

కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - నందిగామ : అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి నందిగామ గాంధీ సెంటర్లో ఐసిటిసి కేంద్రం నందిగామ మరియు కష్ణ వెన్నెల మహిళా సోసైటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తూ ప్రతిజ్ఞ చేశారు . ఈ సందర్భంగా ఐసీటీసీ కేంద్రం నందిగామ ఇన్చార్జి సుమన్ మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎయిడ్స్ నివారణకు తప్పనిసరిగా కండోమ్స్ వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కష్ణ వెన్నెల మహిళా సొసైటీ అధ్యక్షురాలు సీబా, ఐసిటిసి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిభిరం ఆదివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేముల పల్లి రవికుమార్ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యం నేర్పించే ఇలాంటి శిబిరాలకు విద్యార్థులను తల్లింతండ్రులు తప్పక పంపించవలసినదిగా కోరారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో టీవీలకు, సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా, వారి మెదడు నిత్యం చురుకుగా ఉండేలా చేసే కార్యక్రమాలకు పంపాలి అని కోరారు.ఈ శిబిరంలో విద్యార్థులు నేర్చుకొనుచున్న అంశాలను వారితో చర్చించి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు.అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని , విద్యార్థులు, గ్రంథాలయాదికారిణి కె.రమా దేవి, గ్రేడ్ 3 గ్రంథ పాలకురాలు వై.ధన లక్ష్మి, సిబ్బంది కే.రాంబాబు, కుమారు, ఫణి బాబు, గోపాలరావు, దుర్గాంబ, శ్రీనివాస శర్మ, టి. సునీతమ్మ, యం.రమాదేవి ఎన్.పద్మావతి, నిర్వహకులు పిల్లి నాగమణి పాల్గొన్నారు.

కవికాలమ్

నిశి రాత్రి పొరలను చీల్చుకుంటూ
చంద్రకాంతి కిరణాల ప్రతిబింబం
ధాత్రిలోని ప్రకతితో ఓలలాడుతూ
రాత్రిలోని ఒక నిసార్ధ భాగంలో
నక్షత్ర నివహాగగనం ఓరగా
భూమి మీదకు వంగి ఏదో
రహస్యం చెబుతున్న వేళ
కనురెప్పలు మాటున మెరుపు
వీణలు మీటిన రసార్ధ భావనో
ద్దీప్తి సుందర ధుమధుర
రసగుళికల సమాహారమే
సౌష్ఠవ అమతతరంగణి
నిచ్చే అమతకరుడా!!!!
(చందమామ) అంతటి
లావణ్యకరుడికి ఆపత్కల
సమయం ఆసన్నమైనప్పుడు
లయకారుడి తోడు
బహచ్ఛత్రఃమైన అహంకారం
మిడిసిపడినప్పుడు చంద్ర
దోషానికి గురయ్యి శపించబడి
మరల అద్వితీయస్థితికి వచ్చిన
ఓ చిన్నారి ప్రకతి నేస్తమా నీ
యొక్క ఆగమానానికి మరియు
నా ఎదురు చూపుల ప్రతిఫలానికి
మేఘావత్తిలో దాగుడు
మూతలు ఆడుతూ నన్ను ఆట
పట్టిస్తూ దానికి సాక్షాత్కారంగా
నిలిచే చుక్కలతెరువా(ఆకాశం)
అందుకో నా తరుపున నమస్కార
కుసుమాంజలి !!!!!

-రాహిణ్య

పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్: భావితరాలకు మెరుగైన జీవితాలను అందించడానికి ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆయన మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా మంగినపూడి సముద్ర తీరం వద్ద ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో అన్ని మండలాల్లో మిషన్ లైఫ్ పేరిట 75 పర్యావరణ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. వాటిలో ముఖ్యంగా ఏడు విభాగాలైన నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, వ్యర్థాలు తగ్గింపు, ఈ-వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్, హెల్తీ లైఫ్ స్టైల్ వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని వివరిస్తూ ఆహారం దొరక్క పశువులు నిత్యం ప్లాస్టిక్ ని ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయని ఇది ఎంతో బాధాకరమన్నారు. ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ భూమిలో కలవడానికి ఎన్నో ఏళ్లు పడుతుందని, దీనిని దష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం ఈ అలవాట్లు ఎంతో అవసరం అన్నారు. ఇక నుంచి ప్రతివారం సముద్ర తీర ప్రాంతంలో చెత్తను శుభ్రపరుచుకునేలా ప్రణాళికలు రూపొందించి పక్కా చెత్తకుండీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యావరణ భద్రత మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. అనంతరం బెల్, ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీ, సంధ్య ఆక్వా, గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, బందరు డివిజన్ రెవెన్యూ అధికారి ఐ.కిషోర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు పర్యావరణ ఇంజనీరు టి. ప్రసాద రావు, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర రావు, సహాయ పర్యావరణ ఇంజనీరు కే.జ్యోత్స్న శ్రీ, భద్రత మరియు బాధ్యత ఫౌండేషన్ నిర్వాహకులు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రాజాబాబు తదితరులు



అవుట్ ఫాల్స్ స్లూయిస్‌లను పునర్నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల దిగువ ప్రాంతంలో వేల ఎకరాల పంట భూములను బీడు భూములుగా మార్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందని కోడూరు మండల జన సైనికులు అన్నారు. ఆదివారం అవనిగడ్డ నియోజకవర్గం జనసేన నాయకులు, జనసైనికులు శిథిలావస్థకు చేరిన పాలకాయతిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సముద్రపు కరకట్ట వెంబడి ఉన్న అవుట్ పాల్స్ స్లూయిస్ గేట్లు పూర్తిగా పాడై శిథిలావస్థకు చేరుట కారణంగా నేరుగా సముద్రపు ఉప్పునీరు మురుగు కాలువల ద్వారా పంట పొలాల్లోకి చేరి సుమారు 4వేల ఎకరాల సాగు భూమి బీడు భూమిగా మారిందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అవుట్ పాల్స్ స్లూయిస్,నిర్మాణ విషయంలో రైతుల సమస్యల పరిష్కార విషయంలో ,స్థానిక ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రైతు కుటుంబాల ఆవేదనను గుర్తించి అవుట్ పాల్స్ స్లూయిస్‌లను వెంటనే పునర్నిర్మాణం చేసి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరిరావు, బడే వెంకటేశ్వరరావు, బిజెపి కష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ అవనిగడ్డ టౌన్ అధ్యక్షులు రాజనాల వీరబాబు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్ పంపిణీ చేస్తున్న దృశ్యం

క్రికెట్ కిట్ పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : భావి భారతావనికి నేటి యువత పునాదులని వేసవి సెలవల దష్ట్యా యువత చెడు ప్రలోభాలకు గురికాకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని నిర్మించుకోవాలని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పడమర వీధిలోని క్రికెట్ టీంకు క్రీడాకారులకు అవనిగడ్డకు చెందిన శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు క్రికెట్ కిట్ అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు . యువత చెడు వ్యసనాల కు దూరంగా ఉండాలని అన్నారు. బాల్యం నుండే సమాజ సేవ అలవర్చుకోవాలని కోరారు. నేటి వరకు అవనిగడ్డ నియోజకవర్గంలో చల్లపల్లి ఘంటసాల మోపిదేవి అవనిగడ్డ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్, క్రీడాకారులు శివ కిషోర్, లోహిత్, సాయిచంద్, సాయి, తరుణ్, తేజ, శశికాంత్, ధనేశ్, సాయి సుదర్శన్, కార్తీక్, చరణ్, వీరబాబు, రామకష్ణ, వంశీ, దినేష్, సతీష్, భాను, కష్ణమూర్తి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా వాకర్ల సేవలు

ప్రజాశక్తి-గన్నవరం : మండుతున్న ఎండల ప్రభావానికి కొద్దిపాటి సేద తీర్చుకునేందుకు గన్నవరం వాకర్స్ అసోసియేషన్ మజ్జిక పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్థానిక గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో కొద్దిరోజులుగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలను గన్నవరం సర్పంచ్ నిదమర్తి సౌజన్య, జడ్పిటిసి ఎలిజిబెత్ రాణి ప్రారంభించారు. ప్రజల అవసరాలకు అను గుణం గా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకష్ణమూర్తి, కార్యదర్శి ప్రసాద్ దాతల సహకారంతో చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. క్రమశిక్షణ నిజాయితీతో కూడిన అభి వద్ధి ని సాధించి ప్రజలుకు చేరువ కావాలని వారు ఆకాంక్షించారు. బాలకష్ణమూర్తి మాట్లాడుతూ.. రాష్ట్రం లో జగన్ మోహన్ రెడ్డి, గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ మోహన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై సేవాకార్యక్రమాల కు ముందడుగు వేసినట్లు తెలిపారు. వీసం ప్రసాద్ మాట్లాడుతూ... వున్నంతలో ప్రజలకు సేవ చేయాలనే దక్పథంతో ఆవిర్భవించిందే వాకర్స్ అసోసియేషన్ అని, మీ అందరి చేయుతతో మరింత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ వాకర్ల ఆర్థిక సహకారంతో 200 లీటర్ల మజ్జిగను అంధించారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అల్పాహారం, రాగిజావ కూడా అందిస్తున్నట్లు తెలిపారు. వాకర్ల పుట్టినరోజు పెళ్లిరోజు వేడుకలను పురస్కరించుకొని వారి సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు బాలకృష్ణ తెలిపారు.



కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. వేసవికాలం కారణంగా భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు,25. వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులను తీర్చుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకొనుటకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పొట్లూరి నరసింహారావు జ్ఞాపకార్థం స్థానిక లయన్స్ సేవా భవనంలో ఆదివారం 110 మంది నిరుపేద వృద్ధులకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నైస్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆది నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ వైపిసి ప్రసాద్, శ్రీరామ్ మూర్తి, ఫణి గోపాల్, ఏ వీరభద్రరావు, సిహెచ్ రాజా, సిహెచ్ బాలాజీ, పి విశ్వేశ్వరరావు, ఎస్ పరందామయ్యా, జంగం మోహన్ రావు, పి రవికుమార్ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి-పెదపారుపూడి : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మండల ఈవోపీఆర్డీ ఎం. నాగిరెడ్డి ఆదివారం అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామ బస్టాండ్ సెంటర్లో ప్లాస్టిక్ గ్లాసులు తదితర వస్తువులు పంట కాలువలో, రోడ్లు వెంబడి వాడేసి ప్రక్కన పడేయడం వలన అనేక అనారోగ్యాలకు కారణం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ విషయమై పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 19వ తేదీ నుండి వచ్చే నెల ఆరో తేదీ వరకు ప్లాస్టిక్ నిషేధంపై మండలంలో గ్రామ గ్రామాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందునా ప్రజలు ప్లాస్టిక్ వాడకని తగ్గించి పర్యావరణాన్ని పెంపొందించే విధంగా ఎవరికి వారే నడుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన సూచించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల అనారోగ్యానికి హైదరాబాదులోని సిటీ న్యూరో సెంటర్లో వైద్య చికిత్స చేయించుకున్న పాత రాజు సత్య కుమార్ కు ముఖ్యమంత్రి సహాయని ద్వారా మంజూరైన నాలుగు లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద అందజేశారు. బాధితులు పోతరాజు సత్యకుమార్ కు సిఎంఆర్ రిలీఫ్ పండుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

అజాతశత్రువు మెర్ల చంద్రశేఖర్ : ఎమ్మెల్యే వంశీ

ప్రజాశక్తి-గన్నవరం : సమాజంలో అందరూ బాగుండాలని ఆకాంక్షిస్తూ ఆ మార్గంలో పయనించిన మెర్ల చంద్రశేఖర రావు ఎందరికో ఆదర్శంగా నిలిచారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. గన్నవరం ఏ బి కన్వెన్షన్ హాలులో ఆదివారం డాక్టర్ కళ్యాణి పౌల్ట్రీ కంపెనీస్ అధినేత మెర్ల చంద్రశేఖర రావు మొదటి వర్ధంతి కార్యక్రమం జరిగింది. గన్నవరం, హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చి మెర్ల చిత్రపటం ముందు పువ్వులు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ చంద్రశేఖర్ తో తనకు 15 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. మంచి పనులు చేయడానికి ఆయన ఎప్పుడూ ముందుండే వారని గుర్తు చేశారు. భౌతికంగా ఆయన లేకపోయినా జనం గుండెల్లో జీవించి ఉంటారన్నారు. కష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ మోహన్‌రావులు మాట్లాడుతూ ఒక ఆత్మీయుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం రాజకీయాల్లోకి తాను వచ్చిన దగ్గర్నుంచి మెర్లతో ఎంతో అనుబంధం కొన సాగిందన్నారు. ఆయన ఎంతో ముక్కుసూటిగా ఉండేవారని గుర్తుచేశారు. ఏ విషయాన్నయినా స్పష్టంగా చెప్పేవారిన్నారు. అందుకే ఆయన అంటే ఇష్టపడని వారు ఉండరని వివరించారు. నిజం చెప్పాలంటే మెర్ల అజాతశత్రువు అన్నారు. ఆయన కుమారుడు మెర్ల వంశీ విజయ్ కళ్యాణ్ కి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నేత అభిరుచి మధు, ప్రముఖ పారిశ్రామికవేత్త భూపతి రాజు బంగారు రాజు, ప్రముఖ రియల్టర్ రవివర్మ, ఇండియా కార్ రేసర్ లోకేష్ గౌడ, పెద్దలు సంగా నరసింహారావు, గుత్తికొండ శ్రీమన్నారాయణ, గన్నవరం ఉప సర్పంచ్ పాలడుగు నాని, గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ కుమారుడితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వంశీ

మొదటిపేజీ తరువాయి

నేడు బందరు పోర్టుకు శంకుస్థాపన

గ్రౌండ్స్ చేరుకుని అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడతారు. అనంతరం 12.15 గంటలకు హెలీకాప్టర్‌లో తాడేపల్లి వెళ్తారు.

జనసమీకరణకు సన్నాహాలు

వైసిపి నాయకులు ముఖ్యమంత్రి జగన్ బందరు పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు సభకు జన సమీకరణపై దృష్టి సారించారు. ర్గఆమాల నుంచి ప్రజటను తరలించేందుకు వాహనాలను సిద్దం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. మహిళలకు బొట్టుపెట్టి సభకు రావాల్సిందిగా ఆహ్వానించారు. బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఎలా అభివృద్ధి చెందుతుంది, ఉపాధి అవకాశాలు ఎలా లభిస్తాయనేది ప్రజలకు వివరించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), బందరు ఎంపి బాలశౌరి పేరతో ఆయన వర్గీయులు సైతం ప్లెక్సీలు ఏర్పాటు చేశారు.

తొలిదశలో నాలుగు బెర్త్‌లు

బందరు పోర్టు మొత్తం 16 బెర్త్‌లతో నిర్మించాల్సి ఉంది. తొలిదశలో 1,730 ఎకరాల్లో నాలుగు బెర్త్‌లు నిర్మించనున్నారు. బొగ్గు రవాణాకు ఒకటి, సాధారణ కార్గో, బహుళ అవసరాలకు మూడు బెర్త్‌లు ఉపయోగిస్తారు. ఈ బెర్త్‌లలో 80 వేల టన్నుల బరువుతో వచ్చే ఓడలు సురక్షితంగా వచ్చే విధంగా వీటిని నిర్మిస్తున్నారు. ఈ బెర్త్‌ల నిర్మాణానికి రూ.5,253. 88 కోట్లు అవసరం. కాగా దీనిలో రూ.3,049. 21 కోట్లను . పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్: రుణం మంజూరు చేస్తోంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలి. సముద్ర అలల తాకిడిని తట్టుకునేందుకు దక్షిణం ఉత్తరాల్లో గోడ నిర్మాణానికి రూ.446 కోట్లు, ఈ గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 4.6 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని డ్రెడ్జింగ్ ద్వారా వెలికి తీయడానికి రూ.1,262 కోట్లు, సముద్రం నుంచి ఓడలు రావడానికి అప్రోచ్ చానల్ నిర్మాణానికి 706. 28 కోట్లు, ఓడలు టర్నింగ్ సర్కిల్‌కు, బెర్త్ పాకెట్స్ కోసం రూ.452. 07 కోట్లు వెచ్చిస్తున్నారు. ఫేజ్ వన్‌లో బెర్త్‌ల నిర్మాణం పూర్తయితే 26. 12 ఎంటిపిఎలు సరకు రవాణా జరుగుతుంది.

బందరు పునర్‌వైభవంపై ఆశలు

బందరు పోర్టుకు నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. తూర్పు తీరంలో తొలి వ్యాపార కేంద్రాన్ని ఆంగ్లేయులు ఇక్కడే ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 16వ శతాబ్ధంలోనే 2 లక్షల జనాభా కలిగి దేశంలో మూడవ పెద్ద పురపాలక సంఘంగా పేరుపొందింది. ఇంతటి వైభవంతో వెలుగొందిన ఈ ప్రాంతం పోర్టు కార్యకలాపాలు నిలిచిపోవడంతో కాలక్రమంలో ప్రాధాన్యత కోల్పోయింది. మళ్లీ పోర్టు బెర్త్‌ల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత పారిశ్రామిక పురోగతికి దోహదపడుతుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మార్గం ఏర్పడుతుందని ఆశిస్తున్నారు.

సమగ్ర ఆస్తుల రికార్డుకు రీసర్వే

ప్రశ్న: రీ-సర్వే ప్రక్రియ ప్రస్తుతం ఏ దశలో నడుస్తుంది?
జవాబు: సర్వే ప్రాధమిక దశలోనే ఉంది. ప్రస్తుతం సర్వే నెంబర్ వైజ్ డోర్ నెంబర్‌లో ఓనర్స్ ఎవరుంటున్నారనే పరిశీలన ప్రాసెస్ జరిగింది. విలేజ్ మ్యాప్స్‌ను గూగుల్ ఎర్త్ కెఎంఎల్ ఫైల్స్ తయారయ్యాయి.
ప్రశ్న: రీ-సర్వే ప్రక్రియలో కీలకమైన డ్రోన్ సర్వే ఎలా నడుస్తుంది?
జవాబు: ప్రాథమిక దశలో తాము నిర్వహించిన విచారణ ప్రకారం...ల్యాండ్ వివరాలు, సర్వే వివరాలు మొత్తం ఉంటాయి. ఈ వివరాల ఆధారంగా ల్యాండ్ రిజిష్టర్స్ పోలిక, వాటిని రుజువు చేస్తారు. ప్రస్తుతం డ్రోన్ ఫ్లై ద్వారా సర్వే చేయాల్సి ఉంది. అయితే ఈ ప్రాసెస్‌ను ప్రభుత్వం ఒక ప్రయివేటు ఏజెన్సీకి ఇచ్చినందున వారు రావాల్సి ఉంది. డ్రోన్ ఫ్లై సర్వే పూర్తి అయితే న్యూ టౌన్ సర్వే నెంబర్లు వస్తాయి. తద్వారా ఆర్థో రిట్‌పై ఇమేజెస్ (ఒఆర్ఐ) వచ్చిన తరువాత వాటిని సాఫ్ట్, హార్డ్ కాపీలుగా విడుదల చేస్తారు. ఇవి ఇచ్చిన తరువాత సర్వే విభాగం గ్రౌండ్ మీదకు వెళ్తారు. ప్రతి ఒక్క ఇంటినీ, స్థలాన్ని, రోడ్లు, మునిసిపల్, ప్రభుత్వ భూములు, పబ్లిక్, ప్రయివేటు ఆస్తుల మొత్తాన్ని డ్రోన్ సర్వే ద్వారా వచ్చిన చిత్రాలతో పోల్చుకొని ప్రతి ఒక్క ప్రాపర్టీకి నాలుగు వైపుల జీయో కోర్డినేట్స్ వస్తాయి. (ఉత్తర అక్షాంశం, తూర్పు రేఖాంశం).వీటిని బేస్ చేసుకొని ఒఆర్ఐలో ఏవైనా తప్పులుంటే సరిచేసి ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లు, సెటిల్‌మెంట్ రిజిష్టర్ (ఎల్‌పిఎం) తయారు చేస్తారు. అనంతరం పబ్లికేషన్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లే లెక్క. ఈ డ్రోన్ సర్వే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.

ఎయిడ్స్ బాధిత కుటుంబాలకు అండగా నిలుద్దాం : కలెక్టర్



ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: ఎయిడ్స్ మహమ్మరినీ సమూలంగా రూపు మాపి ఎయిడ్స్ వ్యాధి రహిత సామాజ నిర్మాణాంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాల్సి అవసరం ఉందని ఎయిడ్స్ బాధిత కుటుబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కొవ్వొత్తులను వెలిగించి ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారికి నివాళులు అర్పించి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో భాగస్వామ్యులు అవుదామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా రూపుమాపడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. హెచ్ఐవి పై ప్రజలలో అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టడమే వ్యాధి నిర్మూలనకు ఏకైక మార్గం అన్నారు. ఎయిడ్స్ వ్యాధి బారిన పడి అనేక మంది అమూల్యమైన ప్రాణాలను కొల్పోడమే కాక వారి కుటుంబాలను చిన్నాబిన్నం చేశారన్నారు. ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా మే నెల 3 ఆదివారం నాడు కొవ్వొతుల వెలిగించి నివారణ అర్పిరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి కారణంగా 153 మంది మృతి చెందిన్నట్లు అధికారక నివేదికలు వెలడిస్తున్నాయన్నారు. ఎయిడ్స్ వ్యాధి బాధితులు సంఘీబావం తెలుపుతూ వారిని ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 7 హెచ్ఐవి నిర్ధారణ కేంద్రాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని 75 ప్రభుత్వ ఆసుపత్రులు 10 ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులతో హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో 1,383 మంది హెచ్ఐవి వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సహాయంతో పాటు పౌష్టికాహారం అందించడం వలన వ్యాధి తగ్గుముఖంపడుతుందన్నారు. హెచ్ఐవి భాధితులకు జీవిత కాలం ఉచిత ఏఆర్‌టి మందులను పంపిణీ చేస్తున్నామని రెండు ఏఆర్‌టి సెంటర్లు ఐదు అనుబంధ ఎఆర్‌టి సెంటర్ల ద్వారా సేవలందిస్తున్నారన్నారు. జిల్లాలో 1,239 మంది హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల 2,250 రూపాలయలను ఆర్థిక సహాయం కింద వారి ఖాతాలలో జమ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేసి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి పట్ల యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎయిడ్స్‌వ్యాధి పట్ల ప్రజలలో చైతన్యం కల్పించడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాతాల ప్రదర్శనలు కరపత్రాలు, గోడపత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నామన్నారు. ఎయిడ్స్ వ్యాధి భాధిత కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యకర్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు. అనంతరం బలమైనా సమాజ నిర్మాణానికి హెచ్ఐవి వ్యాధితో జీవిస్తున్నావారిపట్ల ప్రేమతో సంఘీబావం తెలుపుతానని భాధ్యత కలిగిన పౌరునిగా పరిపూర్ణ చైతన్యం అవగాహనలతో భాధ్యతాయుతమైన ప్రవర్తనతో హెచ్ఐవి /ఎయిడ్స్‌ను అరికట్టేందుకు మనసా... వాచా.. కర్మణతో ముందుంటానని జిల్లా కలెక్టర్ డిల్లీరావు ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో డిప్యూటి మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ ఎన్. బాలస్వామి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డా. కామేశ్వరప్రసాద్, డా. రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా.యం సుహాసిని, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డా. ఉషారాణి, రెడ్‌క్రాస్ సోసైటీ జిల్లా అధ్యక్షులు డా. జి. సమరం, డిపియం పి. కిరణ్, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్, జిల్లా ఎయిడ్స్ నివారణ పర్యవేక్షణ అధికారి జె. ప్రశాంతి, వాసవ్య మహిళ మండలి డైరెక్టర్ రష్మి, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు సమాజికి కర్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: నార్త్ డివిజన్ పరిధిలోని అజిత్ సింగ్ నగర్, నున్న పోలీస్ స్టేషన్ల పరిధిలో లా ఆర్డర్ అధికారులు మరియు సిబ్బందితో పవర్ గ్రిడ్ ఏరియా, నందమూరి నగర్ ఏరియాలలో ద్విచక్ర వాహనదారులకు మరియు ప్రజలకు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణకు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, "హెల్మెట్ ధరించండి రక్షణ పొందండి" మరియు "తల మీదే రక్షణ మీదే" అను నినాదాలతో వాహనదారులకు హెల్మెట్ ప్రాధన్యతపై ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే మత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ దరించకపోవడమేనన్నారు. ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వస్తాడన్న నమ్మకం లేదన్నారు. ఇంటి పెద్దదిక్కును కోల్పోతే ఆ నరకం వేరేగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు ఒక్కరినే బలిగొనవు, మొత్తం కుటుంబాన్నే విచ్ఛిన్నం చేస్తాయన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులను నిత్యం



కళ్లముందు చూస్తూనే ఉంటాం. నష్టం జరిగిన అనంతరం ఆలోచించే కంటే ముందే జాగ్రత్త పడితే మంచిదన్నారు.జరిమానాలు, కేసులకు భయపడి చాలా మంది హెల్మెట్‌ను కొంటున్నా, వాటిని వినియోగించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. వెంట తెచ్చుకుని పోలీసులు కనిపిస్తే ధరించడం, లేదంటే బండి హ్యాండిల్‌కు తగిలించుకోవడం జరుగుతోందన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదంలో తలకు గాయాలు తగలకుండా కాపాడుతుందని, దాని వలన ప్రాణాపాయం నుండి బయటపడవచ్చునన్నారు. దుమ్ము, ధూళి, ఎండ నుండి రక్షణ కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిఇఎ జిల్లా నూతన కమిటీ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎపిజిఇఎ) రిజిస్ట్రేషన్ నంబర్ 384/2022 కృష్ణాజిల్లా నూతన కమిటీని రాష్ట్ర నాయకత్వం ఆదివారం ప్రకటించింది. జిల్లా అధ్యక్షునిగా జి.గోపిచంద్, ప్రధాన కార్యదర్శిగా కె.ఐజక్ ఏసుపాదం, సహాధ్యక్షులుగా పి.మోహనకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.కాంతారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.శ్రవణ్‌కుమార్, కోశాధికారిగా కె.నవీన్, ఉపాధ్యక్షులుగా కె.సాయిబాబు, జి.వాసు, డి.సురేఖ, జాయింట్ సెక్రటరీలుగా కె. సుబ్బారావు, వి.లావణ్య, కె.కిరణ్ కుమార్‌లతో పాటు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యుల పేర్లను ప్రకటించింది విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావులు నూతన కార్యవర్గం వివరాలను ప్రకటించినట్లు జిల్లా కమిటీ ఆదివారం ప్రకటనలో తెలిపింది.

సిపిఎస్‌కు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలి

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-భవానీపురం: రాష్ట్రంలో 2003వ సంవత్సరం నుండి సిపిఎస్ విధానం అమల్లోకి రాగా పూర్తిస్థాయిలో 2004 నుండి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం పూర్తిస్థాయిలో అమలైందని, అయితే అప్పట్లో ప్రధాన ఉద్యోగ సంఘాలన్నీ ఈ విధానం ద్వారా పదవీ విరమణ పొందే ఉద్యోగికి రావాల్సిన పెన్షన్ విలువను లెక్కించడంలో విఫలమయ్యాయని ఫలితంగా నేడు అది మహమ్మారిలా వ్యాపించి వాటి అలసత్వం నేటి తరం లక్షలాది - ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత లేకుండా పోయిందని, కనుక దీనిపై దశలవారీ ఉద్యమానికి సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ అన్నారు. విజయవాడ విద్యాధరపురంలోని కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలునందు జరిగిన ఓ.పి.ఎస్. సాధనసమితి ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో కె.ఆర్. సూర్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం 309 అధికరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం శాసనబద్ధమైన చట్టం ద్వారా లేదా గవర్నరుచే రూల్సు రూపొందించబడిన తరువాత మాత్రమే ఈ యొక్క సి.పి.ఎస్. విధానం అమలు అవ్వాల్సి ఉండగా, అటు చట్టం చేయబడలేదన్నారు. సి.పి.ఎస్ నిర్వహించబడడం అత్యంత బాధాకరమని, చట్టవిరుద్ధమన్నారు.. కాబట్టి తమ సంఘం త్వరలో హైకోర్టులో ఈ విషయమై న్యాయ పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి. అస్కారరావు మాట్లాడుతూ 2004 సంవత్సరం కంటే ముందు నియమితులైన సుమారు 7 వేల మంది రాష్ట్రంలో ఉద్యోగులకు ఎ పాత పెన్షన్ విధానాన్నే అమలుపరచాలని స్పష్టమైన కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉండగా నేటికినీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదని ఇది తీవ్ర అభ్యంతరకరమని వ్యాఖ్యానించారు.. తమ సంఘం త్వరలో చేపట్టబోయే ఆందోళనలలో ఓ.పి.ఎస్. సాధనే ప్రధాన అంశంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్టు మరియు ఔట్సోర్సింగ్ శ్రేణులందరూ తమ సంఘం చేపట్టబోయే దశలవారీ ఆందోళనలలో యావత్తు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఓ.పి.ఎస్. సాధన సమితి కన్వీనర్ ఎల్.వి. యుగంధర్ మాట్లాడుతూ సి.పి.ఎస్. రద్దు, ఓ.పి.ఎస్. ముద్దు అంటూ, పెన్షన్ విద్రోహ దినం అంటూ అనేక రూపాలలో



పి.పి.ఎస్. రద్దు కొరకు ఉద్యమాలు చేశామని, సుమారు 20 ఏళ్ళ నుండి అనేక రూపాలలో ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వ హదయాన్ని కదిలించలేకపోయామని, న్యాయబద్ధమైన పోరాటాలు చేయడం ద్వారా ఓ.పి.ఎస్.ను సాధించుకుంటామని విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ఈయన సి.పి.ఎస్. శ్రేణులందరినీ ప్రత్యక్షంగా మే 22 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే దశలవారీ ఆందోళనలలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం ఓ.పి.ఎస్. సాధన సమితి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, ఎన్.టి.ఆర్. జిల్లా నాయకులు, విజయవాడ నగర శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఒక స్కూలు...ఇద్దరు వాచ్‌మెన్లు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్ మెన్ పోస్ట్ కోసం ఇద్దరు వ్యక్తులు నువ్వా? నేనా? అన్నట్లు పోటీ పడుతున్నారు. ఇరువురిలో ఒక వ్యక్తి ఎమ్మెల్యే లెటర్ తీసుకొని ఉద్యోగం ఇవ్వమని హెచ్‌ఎంపై ఒత్తిడి చేస్తున్నారు.మరో వ్యక్తి గన్నవరం జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి మద్దతుతో తనకు పోస్ట్ ఇవ్వాలని పైరవీలు చేస్తున్నాడు. రాజకీయ వత్తిళ్ల దెబ్బకు స్కూల్ హెచ్‌ఎం తల పట్టుకుని ఎవరికీ అనుమతి ఇవ్వడం లేదు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే...రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్షలాది రూపాయలు వెచ్చించిన నాడు - నేడు పాఠశాలలో రక్షణ నిమిత్తం రాత్రి కాపలాదారుల నియామకం చేపట్టింది. అయితే అంతవరకు బాగానేవుంది. కానీ గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం ఈ పోస్టు నాది అంటే నాదంటూ ఇద్దరు వ్యక్తులు పోటీ పడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లాం కోటేశ్వరరావు కంకిపాడు మండలం ఉప్పులూరు గ్రామానికి చెందినవారు. ప్రభుత్వం కాపలాదారుల ఉద్యోగాలు ఉత్తర్వులు ఇచ్చినప్పుడు స్థానిక శాసనసభ్యుల వారి సిఫారసు ఉత్తరం తీసుకుని ఈపోస్టు నాదే అంటున్నాడు. రాత్రి పాఠశాలలో మకామ్ వేశాడు. అయితే గన్నవరానికి చెందిన గంప నాగరాజు నాకు జడ్పిటిసి రికమండేషన్ ఉందంటూ విధి నిర్వాహణలో చేరాడు. విషయమేమంటే నేను లోకల్, స్థానికులకే ఈ పోస్టు జడ్‌పిటిసి ఎలిజబెత్ రాణి సహకారంతో ఎప్పుడో విధులలో చేరిపోయానని చెబుతున్నాడు. అసలు ఈ పాఠశాలలో రాత్రి కాపలాదారుడు ఉద్యోగా నికి ఎవరు అర్హులో ఉత్తర్వులు ఇవ్వాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కోటేశ్వరరావు, నాగరాజుల పంచాయతీ రోడ్డెక్కింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హత కలిగిన వ్యక్తులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



సంక్షేమ రాజ్యానికి ఆద్యుడు ఎన్టీఆర్



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు ఆదివారం సాయంత్రం గన్నవరంలోని ఎస్.ఎం కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథులు ఎమ్.ఏ షరీఫ్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి,శాసనమండలి మాజీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలే దేవుళ్ళు సమాజమే దేవాలయం అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ రెండు రూపాయలకే కిలో బియ్యం, జనత వస్త్రాలు, పేదలకు గృహ నిర్మాణం, రైతులకు హార్స్ పవర్ కు విద్యుత్ ,మహిళలకు సమాన ఆస్తి హక్కు, తదితర సంక్షేమ కార్యక్రమాలు భారతదేశం లోనే మొట్టమొదటిసారిగా అమలు జరిపారన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మండలి బుద్ధ ప్రసాద్,రాజ్యసభ మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బోడే ప్రసాద్, గుడివాడ, పామర్రు, పెడన నియోజకవర్గాల ఇన్చార్జులు రావి వెంకటేశ్వరరావు, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ ,నియోజకవర్గ పరిశీలకులు వడ్రణం హరిబాబు నాయుడు తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, గోట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, వీరంకి వెంకట గురుమూర్తి, బొడ్డు వేణుగోపాల్, రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాళ్లు మూల్పూరు సాయి కళ్యాణి, యార్లగడ్డ సుచరిత పాల్గొన్నారు.

పోర్టు పేరుతో మోసం : టిడిపి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పోర్ట్ నిర్మాణంపై వైసీపీకి చిత్తశుద్ధి లేదని, పోర్ట్ పేరుతో ఎంతకాలం బందర్ ప్రజలను మోసం చేస్తావ్ నాటకాల నాని అని తెలుగుదేశం పార్టీ నాయకులూ విమర్శించారు. ఆదివారం మచిలీపట్టణం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులూ మాట్లాడుతూ నాడు తండ్రి నాటకాలు చూసి జనాలు విసిగి పోయారు, తరువాత నీ నటన, డ్రామాలతో బందరు ప్రజలను మోసం చేసావు, ఇప్పుడు నీ కొడుక్కు కూడా నాటకాలు నేర్పావు.. అప్పుడే తయారయ్యాడు నాటకాలతో.. బందరు ప్రజలకు ఈ నాటకాల కుటుంబం నుండి ఎప్పుడు విముక్తి వస్తుందో అని ప్రజలు తలలు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అసలు పోర్టు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు వచ్చాయా, ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ వివరాలు వెల్లడించగలరా, నిర్మాణ బాధ్యతలు చేపట్టే కంపెనీ వివరాలు తెలియజేయగలరా, నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ జరిగిందా, ఎంత భూసేకరణ చేశారో ప్రజలకు వెల్లడించాలని ప్రశ్నించారు. బందరులో ఏ వీధికైనా ఏదో ఒక అభివద్ధి కార్యక్రమం చేసింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. గోపు సత్య నారాయణ, కుంచె దుర్గ ప్రసాద్ నాని, కాగిత వెంకటేశ్వర్ రావు, ఇలియాస్ పాషా, తోట రాములు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఆహ్వాన పత్రికలు

- పేర్ని కిట్టుకు ప్రాధాన్యత
- ఎంపీ స్థాయిని దిగజార్చే విధంగా ముద్రణ

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముద్రిం చిన ఆహ్వాన పత్రికలు వివాదాస్పదంగా మారాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణ పనులు ప్రారంభోత్సవం చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే పోర్టు ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు ముద్రించిన తీరు పలు విమర్శలకు తావిస్తుంది. పార్టీపరంగా, అధికారపార్టీ రెండు రకాల ఆహ్వాన పత్రికలు ముద్రించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కు ఇచ్చిన ప్రాధాన్యత బందరు ఎంపి వల్లభనేని బాలశౌరికి ఇవ్వలేదనే విమర్శలు ఉన్నాయి. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పేరుతో ముద్రించిన ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్యే తనయుడు పేర్ని కిట్టు ఫోటోను హై లైట్ చేశారు. ఎంపి ఫోటోను కవర్ పేజిపై ప్రోటోకాల్ ప్రకారమే ఉన్నా చిన్న సైజులో ముద్రించారని, పేర్ని కిట్టు ఫోటోను పెద్ద సైజులో హై లైట్ చేశారని ఎంపీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపోతే కలెక్టర్ పేరుతో ముద్రించిన ఆహ్వాన పత్రికలోనూ ఎంపికు ప్రాధాన్యం ఇవ్వలేదు. విశిష్ట అతిథులు పేర్లలో చివరిగా ముద్రించడం విమర్శలకు దారి తీస్తోంది. మచిలీపట్టణం ఓడరేవుకు నిధులు మంజూరు చేయాలని ఒప్పించి సుమారుగా 4 వేల కోట్ల రూపాయలు రుణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పించిన ఘనత ఎంపీ బాలశౌరికే చెందుతుందని పవర్ కార్పొరేషన్ డైరెక్టర్ మనోజ్ శర్మ స్వయంగా ఒప్పుకున్న విషయం ఎంపి అభిమానులు గుర్తు చేస్తున్నారు. ఎంపీ పేరుకు ముందు నగర మేయర్ పేరు ఉండటం ఎంపీ స్థాయిని తగ్గించిన భావం కలుగుతుందని స్థానికులు అంటున్నారు. ఆహ్వాన పత్రికలలో ఎంపీకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఎమ్మెల్యే, ఎంపీకు మధ్యనున్న అంతర్గత వివాదాలే కారణమని సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పలుచోట్ల మజ్జిగ పంపిణీ



గుడివాడలో...



మోపిదేవిలో...

ప్రజాశక్తి-గుడివాడ : లయన్స్ అఫ్ ప్రగతి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని బ్యాంక్ అఫ్ బరోడా వద్ద అన్నే నవీన్ పుట్టినరోజు సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లంపల్లి వెంకట్రావు, వేణుబాబు, వురిటి రామారావు, అజయ్, శీలం శ్రీనివాసరావు, వీరశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలో గల శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చిన భక్తులకు శ్రీ మత్తి హరిశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. శ్రీ మత్తి హరిశంకర్ ఫౌండేషన్ చైర్మన్, జనసేన పార్టీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు మజ్జిగను అందించారు. మూడు వేల మందికి పైగా భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కామిశెట్టి శ్రీనివాసరావు, భోగిరెడ్డి సాంబశివరావు, సాయి తేజ, కాంతారావు, బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



'విప్లవ సాహిత్యం - వస్తు వైవిధ్యం'పై సమావేశం

ప్రజాశక్తి - గుడివాడ : విప్లవమంటే తుపాకీ పట్టి పోరాడటం కాదని కలంతో కూడా విప్లవాన్ని సష్టించవచ్చని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం సాహితీ స్రవంతి గుడివాడ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో 'విప్లవ సాహిత్యం - వస్తు వైవిధ్యం' అనే అంశం పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కెంగార మోహన్ మాట్లాడుతూ అన్నమయ్య, పాల్కురికి సోమనాధుడు, వేమన, వీరబ్రహం తదితరులు సామాజిక అసమానతలపై కలం పట్టి, ప్రజలలో చైతన్యం రగిలించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువ కవులు సామాజిక స్పృహతో రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి లంకా సురేంద్ర అధ్యక్షత వహించగా, జి. మళ్ళాద్రి, కె. గాంధీబాబు సాయిలక్ష్మి, అవిర్నేని వెంకటేశ్వరరావు, ఆర్‌సిపి రెడ్డి, నరహరిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెద పారుపూడి : వేసవి శిక్షణా తరగతులలో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాల కురాలు యంవియస్ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు " విద్యార్థులు - శారీరక క్రమశిక్షణ" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దంతనాల భాస్కరరావు, శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.విద్యార్థులు శారీరకంగా క్రమశిక్షణతో ఉంటే చక్కని విద్యా నైపుణ్యాలు అవలడుతాయని, ఇందుకు ఆటలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాదర్ రవికాంత్‌కు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ : పవిత్ర ఆత్మతో ప్రేరణ పొంది ప్రపంచమంతటా తిరిగి దైవ వాక్కును అందించటం గురువుల బాధ్యత అని ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని మౌంట్ కార్మల్ (ఆర్‌సిఎం) చర్చిలో ఏడాది కాలంగా సహాయ గురువుగా పనిచేసిన రవికాంత్‌కు వీడ్కోలు సభను కౌన్సిల్ సభ్యులు, యూత్, మరియదళ, విన్సెంట్ డి పాల్ సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, సభ్యులు రెబ్బా బాలరాజు, వీరబత్తిన జీవరత్నం, ఇంటి స్వామిదాసు, ఉపదే శికులు దార సబాస్టిన్, తోట క్రీస్తురాజు, ఆంతోని, భాస్కర్, బాలస్వామి, యూత్ అధ్యక్షుడు ఎం.జ్యోషి, సభ్యులు సిస్టర్స్ పాల్గొన్నారు.



కంటి కేన్సర్‌పై అవగాహనకు వైటాథన్ వాక్

ప్రజాశక్తి-హెల్త్ యూనవర్సిటీ: తాడిగడపలోని ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైటాథన్ వాక్‌ను ప్రపంచ ప్రఖ్యాత ఆర్చరీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ వాక్ ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ క్యాంపస్ నుంచి తాడిగడప సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా చెరుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ కంటి సమస్యలపై అవగాహన కొరకు ఇటువంటి రన్ నిర్వహించడం అభినందీయమన్నారు. ముఖ్యంగా ఈ వాక్ పిల్లలలో సంభవించే రెటినోబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించుట, ముందస్తు రోగ నిర్ధారణ, చికిత్స లక్ష్యాలతో ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించారని తెలిపారు. ప్రముఖ వైద్యులు, హాస్పిటల్ క్యాంపస్ హెడ్ డా.అనసూయ కపూర్ మాట్లాడుతూ పిల్లలలో సంభవించే నేత్ర క్యాన్సర్ యొక్క సాధారణ లక్షణాలు పట్ల తల్లితండ్రులు, సంరక్షకులు సమాజం సరియైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది అన్నారు. కంటిలో తెల్లని రిఫ్లెక్షన్ కనిపించుట ఈ వ్యాధి యొక్క సాధారణ లక్షణాలలో కీలకమైన వాటిలో ఒకటి అని



తెలిపారు. గుర్తించిన వెంటనే సకాలం లో వైద్య చికిత్స పొందాలన్నారు. రెటో నాబ్లాస్టోమా అనే కంటి కేన్సర్‌ను ముందుగా గుర్తించి క్యాన్సర్ కణితిని తొలగించి చికిత్స అందిస్తే నయమవుతుందని తెలిపారు. ఈ రన్ ద్వారా సేకరించిన నిధులు రెటో నాబ్లాస్టోమా కంటి కేన్సర్ తో బాధపడుతున్న పిల్లల వైద్య చికిత్సకు మరియు ఈ చికిత్సకు నూతన పరిశోధనలు కొనసాగించుటకు వినియోగిస్తారనీ తెలియచేశారు.. ఎందుకంటే ఈచికిత్స అత్యంత ఖరీదు తో కూడుకోవటమే కాక సుదీర్ఘకాలం చికిత్స అందించాల్సి ఉంటుందని తెలిపారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-భవానీపురం: మండు వేసవి సందర్భంగా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు విద్యాధరపురం, చెరువు సెంటర్ నందు 44వ డివిజన్‌లో విద్యాధరపురం, భవానీపురం చౌకడిపో డీలర్ల ఆధ్వర్యంలో ఆదివారం పాదచారులకు చల్లని మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా చౌకడిపో డీలర్ల సరఫరా అధికారి కోమలి పద్మ, స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పాల్గొని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ చౌకడిపో డీలర్ల ఆధ్వర్యంలో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పల్లపోతు మురళీకష్ణ (కొండపల్లి బుజ్జి), చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, మైలవరపు దుర్గారావు, 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, గురునాథం, నాలం నాగేశ్వరావు, ఓలేటి రంగ, స్పీడ్ సుబ్బారావు పాల్గొన్నారు.

చురుగ్గా మొక్కజొన్న కొనుగోళ్లు : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రారంభమైన మొక్కజొన్న కొనుగోళ్లు చురుకుగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న సాగుచేసిన ప్రాంతాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వద్ద నుండి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నేటివరకు 348 మంది రైతుల వద్ద నుండి క్వింటాకు 1,962 రూపాయలు కనీస మద్దతు ధరకు 3,076 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న విక్రయించిన రైతులకు చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియ కూడా జాప్యం లేకుండా జరుగుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేసిన పంటకు సంబంధించి రూ 6.03 కోట్ల రూపాయలకు సంబందించి రైతుల వివరాలను ఆన్ లైన్ లో ప్రాసెస్ చేసినట్లు తెలిపారు. నేటి వరకు రూ.1.68 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ జూనె నెల నాల్గవ తేదీ వరకు కొనసాగుతుందని రైతులు సమీపంలోని కొనుగోలు కేంద్రాల లో మొక్కజొన్నను విక్రయించుకొని ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలని జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భవానీపురం: పెయింట్ పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన పెయింట్ మేస్త్రి కుటుంబానికి జనసేన పార్టీ తరఫున 45వ డివిజన్ జనసేన నాయకులు బొమ్ము రాంబాబు, జనసేన పార్టీ 45వ డివిజన్ లోని కొంతమంది జనసైనికులు కలసి ఆ కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందచేశారు.ఈ సందర్భంగా బొమ్ము రాంబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అంటే సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పుడు తమకు తోచిన విధంగా సహాయం చేసే పార్టీ అని కొనియాడారు. జనసేన అధినాయకుడు నుండి చివరి స్థాయి కేటగిరి నాయకులు వరకు అదే ఉద్దేశంతో కొనసాగుతున్నారని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో పోతిన వెంకట మహేష్ సారథ్యంలో తాము ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు.



ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



ప్రజాశక్తి-కంచికచర్ల: భారత దేశంలో ఐటి రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన మహోన్నత వ్యక్తి రాజీవ్ గాంధీ అని పలువురు కొనియాడారు.మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కంచికచర్ల లో ఘనంగా నిర్వహించారు.స్తానిక చెవిటికల్లు రోడ్డులో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశాభివద్ధికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూదుల పూర్ణచంద్రరావు, యస్ సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వేముల జయరాజు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం:** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 32 వ వర్ధంతి వేడుకలు ఆదివారం కొండపల్లి మునిసిపాలిటీ బి కాలనీ సెంటర్ నందు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ మరియు స్థానిక నాయకులు పాల్గొని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాస్ చిలుకూరు గ్రామ సర్పంచ్ గొంది సురేష్ నర్సింహారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మునిసిపాలిటీ ఉపాధ్యక్షులు చెరుకు ఆనందరావు మాజీ పంచాయతీ మెంబర్లు రాగాల రాము పోతురాజు థామస్ బుజ్జి బాణావత్ హేమనాయక్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ గాంధీ సెంటర్లో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కర్ల శ్యామ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పెసరమల్లీ శ్యాం బాబు, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గోపు నరేంద్ర, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ షేక్ ఆరిఫ్, వేల్పుల శ్రీహరి, శాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మైలవరం:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ , డిసిసి ఉపాధ్యక్షులు శీలం రామకష్ణ,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసపాటి గిరిధర్ కుమార్,మండల పార్టీ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, అన్నవరపు దుర్గారావు, మసనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ



ఎయిడ్స్ రహిత ప్రపంచానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎయిడ్స్ మహమ్మారిని అంతం చేయడంలో ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలియచేయాలి అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షులు డా॥జి.సమరం పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్ వద్ద గల నాస్తికకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ స్మారక దినోత్సవాన్ని యూఎన్ ఎయిడ్స్ 1983 నుండి ప్రతి సంవత్సరం మే 3వ ఆదివారం నిర్వహిస్తోందన్నారు. ఇంతవరకు ప్రపంచంలో ఎయిడ్స్‌కి గురై 4కోట్ల 10లక్షల మంది మరణించారన్నారు. ఈ రోజున వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఎయిడ్స్ నివారణలో మన అందరి సంఘీభావాన్ని తెలియచేయడానికి ఈ కాండిల్ లైట్ డేని ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతోందన్నారు.ఈనాడు ప్రపంచంలో 3కోట్ల 84లక్షల మంది హెచ్.ఐ.వి.తో జీవిస్తుండగా, మన భారతదేశంలో 21లక్షల మంది హెచ్.ఐ.వి.తో జీవిస్తున్నారన్నారు. ఎయిడ్స్ వ్యాధి వల్ల ప్రతీ సంవత్సరం ప్రపంచంలో 6లక్షల 50వేలమంది మరణిస్తున్నారన్నారు. ఎక్కువ మంది ఎయిడ్స్ రోగులు ఆఫ్రికాలోని దక్షిణ ప్రాంతంలో ఉన్నారన్నారు. అక్కడ నివసిస్తున్న జనాభాలో 10శాతం మంది ఎయిడ్స్‌తో జీవిస్తున్నారన్నారు. సౌత్ ఆఫ్రికా దేశంలో 75లక్షల మంది హెచ్.ఐ.వి. వ్యాధిగ్రస్తులు ఉన్నారని, అంటే జనాభాలో 17.3శాతం మంది ఎయిడ్స్‌కి గురై ఉన్నారన్నారు. వీరిలో పెద్దవాళ్ళే 28.3శాతం మంది ఉన్నారన్నారు. బోత్సవానా, ఈష్వాటిని, లెసోథో దేశాలలో 15శాతం మంది ప్రజలు ఎయిడ్స్‌కి గురై ఉన్నారన్నారు. మన భారతదేశంలో ఎయిడ్స్‌కి గురైనవాళ్ళు కేవలం 0.2శాతం ఉన్నారన్నారు. ఈ రోజు మన భారతీయులందరం సాయంత్రం కేండిల్స్ వెలిగించాలన్నారు. చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఎయిడ్స్ రహిత ప్రపంచాన్ని నిర్మించాలంటూ మనమందరం సంఘీభావం తెలియచేద్దామని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బెంగళూరులో ఐటి ఉద్యోగిని మృతి

ప్రజాశక్తి-గన్నవరం: బెంగళూరు వరదల్లో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం తో కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తెలప్రోలుకు చెందిన ఐటీ ఉద్యోగిని బత్తుల భానురేఖ (22) మతిచెందారు. కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లగా ఊహించని విధంగా ప్రమాదానికి గురయ్యారు. వరద ముంచెత్తిన సమయంలో కారులో భానురేఖతో పాటు కుటుంబ సభ్యులు ఆరుగురు ఉండగా.. వారిని పోలీసులు, స్థానికులు కాపాడారు. అప్పటికే భానురేఖ తీవ్ర అస్వస్థతకు గురై మరణించినట్లు పోలీసులు చెప్పారు.

కార్మికులకు ఒప్పో ప్రోత్సాహం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వలస కార్మికులకు తగిన విధంగా ప్రోత్సాహం అందించేందుకుగాను ప్రముఖ గ్లోబల్ స్మార్ట్ డివైజ్ బ్రాండ్ ఒప్పో, టి-సిగ్ సంస్థతో భాగస్వామ్యం చేసుకుని ముందుకు వెళుతున్నట్లు ఒప్పో సంస్థ ఇన్‌ఛార్జి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉడాన్ కార్మికుల ఆరోగ్యం, పోషకాహారం, పిల్లల విద్య, వేతనాలు, జీవన పరిస్థితులలతో సహా వారి శ్రేయస్సును మెరుగుపరచుకునేందుకు ఈప్రాజెక్టు ద్వారా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి స్పాన్సర్‌గా ఒప్పో, టి-ఎస్ఐజి, సంస్థ ఆరు నెలల పాటు వివిధ ప్రాంతాలలో పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని నివసిస్తున్న 2500 పైగా వలస కార్మికులు, 400 మంది పిల్లల జీవితాలను తగిన విధ:గా తొలి విడతగా ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు.

నోకియా 4జీ ఫీచర్ ఫోన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వినియోగదారులకు ఎప్పటికపుడు కొత్త తరం ఫోన్లను అందించడంలో ముందున్న నోకియా సరికొత్తగా 106 నూతన 4జీ ఫీచర్‌తో విడుదల చేసినట్లు సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. నోకియా 105 మార్కెట్ లీడింగ్ ఫీచర్ ఫోన్ ఫోర్ట్‌పోలియోకు నూతన జోడింపులను ప్రకటించినట్లు తెలిపారు. ఈఫోన్‌లు యుపీఐ 123 పే ఫంక్షనాలిటీతో వస్తాయన్నారు. యూపీఐ సౌలభ్యం, డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా, సజావుగా నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.